క్లుప్తంగా

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

తాండూరు రూరల్: బీజేపీ తాండూరు మండల కార్యకర్తల సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జినుగుర్తి గేటు సమీపంలో జరగనున్న సమీక్షకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొననున్నారని వెల్లడించారు.

సంక్షేమ పథకాల్లో జాప్యం తగదు

కొడంగల్ రూరల్: సంక్షేమ పథకాల అమలులో జాప్యం తగదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ అన్నారు. మంగళవారం ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధిలో భాగంగా నిరుపేద, మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.లక్ష ఆర్థిక సహాయం వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ. ముర్తుజా, సయ్యద్ ముస్తాఫా, ఎండీ. జాఫర్, ఎండీ. అబిద్, ఎండీ. ముబీన్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సలావుద్దీన్‌కు సన్మానం



సలావుద్దీన్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొడంగల్ రూరల్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఆగస్టు 15న పురస్కారం, సన్మానం పొందిన మున్సిపల్ సీనియర్ సూపర్‌వైజర్ సలావుద్దీన్‌ను మంగళవారం స్థానిక మక్కామసీద్‌లో మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎం. గౌసన్ ఆధ్వర్యంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇమామ్‌లు ఖతీబ్ మౌలానా హఫీజ్, మహ్మద్ అబ్దుల్ ఖరీం, అసోసియేషన్ సభ్యులు మహ్మద్ సలీం, ఆసిఫ్‌ఖాన్, షేక్ అహ్మద్, మహ్మద్ రహీమ్, సుల్తాన్ మొహియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

యాలాల: రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని రాస్నం సర్పంచ్ సురేఖ, ఉపసర్పంచ్ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్వామీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆపద సమయంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ప్రాణాలు కాపాడేందుకు రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యం కూడా ఎంతో చురుగ్గా ఉంటుందని తెలిపారు. అనంతరం దాతలకు తాండూరు జిల్లా ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు శివాజీ, నరేష్‌గౌడ్, అబ్దుల్ ఆజం, లవకుమార్, నవీన్‌కుమార్, యాదగిరి, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, వైద్యులు వాణి, మంజు, వైద్య సిబ్బంది మోసిన్, శ్రీకాంత్, శ్రీనివాస్, బీరప్ప తదితరులు ఉన్నారు.

గొడవలు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

నవాబుపేట: గ్రామంలో గొడవలు సృష్టించేందుకు కుట్ర చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిట్టిగిద్ద సర్పంచ్ శ్రీలత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో బొడ్రాయి నెలకొల్పేందుకు రెండు రోజుల క్రితం గ్రామ పెద్దలతో చర్చించామని చెప్పారు. అందుకు వచ్చే నెల 11న ముహూర్తం ఖరారు చేసుకున్నామని వెల్లడించారు. కానీ ఈ లోపే కొందరు గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డు మధ్యలో ఒక రాయిని పాతి, ఇదే బొడ్రాయి అని పసుపు, కుంకుమలు చల్లారని వాపోయారు. అక్కడికి వెళ్లి చూడగా.. కొందరు తనపై దురుసుగా ప్రవర్తించారని సర్పంచ్ ఆరోపించారు. గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించ కూడదనే దురుద్దేశంతోనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం



స్కావెంజర్ కుటుంబానికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: బిచ్చాల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్ జమీలా బేగం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబానికి జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు కలిసి రూ.55,100 నగదును భర్త బాబుమియాకు ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఊషన్న, రాజు, హన్మంతు, లక్ష్మయ్య, సుధాకర్, రాములు, శ్రీధర్, నారాయణ సీఆర్పీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మంద' రాదాయె!



టేకులపల్లిలో ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలు

రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. లబ్ధిదారుల వాటాను సైతం కలెక్టర్ ఖాతాలో జమ చేయించింది. కానీ మూడు నెలలు కావస్తున్నా జీవాల మంద జాడ కానరాక కాపరులు కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్న వైనంపై 'సాక్షి' కథనం..

కలెక్టర్ ఖాతాలో లబ్ధిదారుల వాటా జమ
- మూన్నెళ్లు కావస్తున్నా పత్తాలేని యూనిట్లు
- ఆందోళనలో గొర్ల కాపర్లు

మోమిన్‌పేట: గొల్ల కుర్మల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పంపిణీకి 2017లో శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కాపరుల సంఘం నేతలు మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు గాను 19 గొల్ల, కుర్మ సంఘాలను ఏర్పాటు చేయగా.. దాంట్లో 1,200మంది లబ్ధిదారులు సభ్యులుగా చేరారు. అప్పట్లో తొలి విడతలో 600 మందికి జీవాలను పంపిణీ చేయాలని, మిగతా 600 మందికి రెండో విడతలో ఇవ్వాలని లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు.

ఒక్కొక్కరు రూ.43 వేలు

ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలుకు నాడు రూ.1.25లక్షల విలువ చేస్తే.. అందులో 75శాతం ప్రభుత్వం, 25శాతం లబ్ధిదారుడు చెల్లించేలా ప్రభుత్వం నిబంధనలో పేర్కొంది. అనుకున్నట్టుగానే తొలి విడతలో 600మందికి పంపిణీ చేశారు. ప్రస్తుతం యూనిట్ ధరను ప్రభుత్వం రూ.1.75లక్షలకు పెంచింది. అందులో లబ్ధిదారుని వాటా రూ.43,750లు కాగా.. మిగతా మొత్తం ప్రభుత్వం రాయితీ రూపంలో ఇస్తుంది. మలి విడతలో 600మందికి జీవాలు పంపిణీ చేయాల్సి ఉండగా.. అందులో 332మంది అప్పోసప్పో చేసి ఒక్కొక్కరు రూ.43.750ల చొప్పున కలెక్టర్ ఖాతాలో మూడు నెలల క్రితమే డబ్బులు జమచేశారు. కానీ ఇప్పటి వరకు గొర్రెల పంపిణీ లేకపోయే సరికి లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే పంపిణీకి చర్యలు తీసుకోవాలని కాపలాదారులు కోరుతున్నారు.

అప్పుచేసి చెల్లించా..



రెండో విడత గొర్రెలకు తమ వాటా కింద రూ.43.750లు కలెక్టరు ఖాతాలో జమచేశాను. మూన్నెళ్ల గడుస్తున్నా అధికారుల నుంచి పిలుపు రాలేదు. అప్పు చేసి చెల్లించాను. గతంలో డీడీలు తీయడం వలన డబ్బులు తిరిగి తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. జీవాలను వెంటనే పంపిణీ చేయాలి.

– రమేశ్, లబ్ధిదారుడు, పెద్దగొల్ల

నెల్లూరు పంపించాం



మొదటి సారి 12మందికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వారిని గొర్రెలు కొనుగోలు చేసేందుకు ఏపీలోని నెల్లూరు జిల్లాకు పంపించాం. 525 మందిని రెండో విడత కింద ఎంపిక చేశాం. ఇప్పటికి 332మంది కలెక్టర్ ఖాతాలో తమ వాట నిధులను జమచేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వారికి యూనిట్లు ఇస్తాం.

– గీత, పశు వైద్యాధికారి, మోమిన్‌పేట



కుల్కచర్ల: విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న కోటాజీ

ఓటు హక్కు పౌరుడి వజ్రాయుధం

- అర్హులందరూ ఉపయోగించుకోవాలి
- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ

కుల్కచర్ల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధం అని, దానిని ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఓటుహక్కు గురించి తెలుసుకోవడంతో పాటు.. తమ ఇళ్లలో కూడా ఓటుహక్కు ప్రయోజనాల గురించి కుటుంబీకులకు తెలియజేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటుహక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండవెల్కిచర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలవరలక్ష్మి, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి..

దోమ: ప్రతి పౌరుడు ఓటు హక్కు నమోదు చేసుకునేలా బీఎల్‌ఓలు కృషి చేయాలని తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఓటు నమోదుపై బీఎల్‌ఓలతో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు నమోదును ప్రక్రియను పరిశీలించాలని, ఓటు హక్కు లేని వారిని గుర్తించి, నూతన ఓటరుగా నమోదు చేయించాలని చెప్పారు. జాబితాలో ఉన్నవారిలో ఏమైనా పొరపాట్లు ఉంటే సవరణలు చేసేందుకు శ్రద్ధ చూపాలని చెప్పారు. బాధ్యతాయుతంగా పని చేస్తూ ఓటరు నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐ లింగం తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల చుట్టూ తిరగొద్దు

- ఇంటింటికీ వస్తాం.. అర్జీలను పరిశీలిస్తాం
- ఎంపీడీఓ లక్ష్మప్ప



గృహలక్ష్మి అర్జీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మప్ప

పెద్దేముల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, అధికారులు మీ ఇంటికి వచ్చి అర్జీలను పరిశీలిస్తారని ఎంపీడీఓ లక్ష్మప్ప తెలిపారు. మంగళవారం పెద్దేముల్ మండలం మదనంతపూర్ తండాతో పాటు పలు గ్రామాల్లో అధికారులు గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. అర్జీ దారులు ప్రస్తుతం ఉంటున్న నివాసం, అదె ఇళ్లు, సొంతిళ్ల అనే విషయాలను తెలుసుకున్నారు. నిజమైన లబ్ధిదారులకు తప్పకుండా గృహలక్ష్మి అందుతుందని పేర్కొన్నారు. ఎంపీడీఓతో ఏపీఓ లక్ష్మీదేవి, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గులాబీ శ్రేణుల జోష్

- నేతలకు శుభాకాంక్షల వెల్లువ
- మరోసారి భారీ మెజార్టీతో గెలిపించి తీరుతామంటూ ధీమా



యాలాల: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ మండల నాయకులు



బంట్వారం: నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆనంద్

యాలాల: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరు ఖరారు కావడంతో మండల నాయకులు మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పసుల రమేష్, యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు పటేల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మెట్లి ఆశన్న, మాజీ సర్పంచ్‌లు అన్నసాగర్ సాయిలు, అరవింద్‌కుమార్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లాలప్ప తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఆనంద్‌కు..

బంట్వారం: మరోసారి వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌కు టికెట్ ఖరారు కావడంతో బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు వికారాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. రైతుబంధు జిల్లా సభ్యుడు, పార్టీ సీనియర్ నాయకుడు బల్వంత్‌రెడ్డి, యూత్ వింగ్ మండల అధ్యక్షుడు బల్వంత్, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపిస్తాం

పెద్దేముల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలపిస్తామని బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యేకు టికెట్ మరోసారి ఖరారు కావడంతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రావణ్ కుమార్, పాండునాయక్, మోహన్‌రెడ్డి, నాయకులు సంఘమేశ్వర్, వెంకటేశం, ముజీఫ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతిగా..

మోమిన్‌పేట: మరోసారి టికెట్ దక్కడంతో ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంతో నమ్మకంతో కేసీఆర్ తిరిగి టికెట్ ఇచ్చారని, గెలిచి బహుమతిగా ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్‌రెడ్డికి ఘనస్వాగతం



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

పూడూరు: పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి టికెట్ ఖరారు కావడంతో మన్నేగుడ చౌరస్తాలో ఆయనకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాల వేసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రహీస్‌ఖాన్, ఆదిల్, జాహెద్, సర్పంచ్‌లు వినోద్‌గౌడ్, బుచ్చన్న, సంధ్య, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ తదితరులు

- ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిన ప్రభుత్వం
- మాజీ మంత్రి ప్రసాద్ కుమార్
- 26న ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ సభ

అనంతగిరి: రానున్న శాసనసభ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్, నాగర్ కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం వికారాబాద్‌లోని ప్రసాద్ కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు రెండూ ఒకటేనని, ప్రజాకోర్టులో వారిని దోషులుగా నిలబెడతామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో తెచ్చిన ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం తూట్లు పొడిచిందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించామని, కానీ కేసీఆర్ అధికారం చేపట్టాక దానిని పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలను మోసం చేశారని మండిపడ్డారు.

24 రేవంత్ పర్యటన

ఈ నెల 26న చేవేళ్లలో కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ సభను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని, సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా రానున్నారని మాజీ మంత్రి తెలిపారు. ఈ సభ ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సభ నిర్వహణ కోసం జిల్లాలో 24న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పర్యటించనున్నారని, ఈ సందర్భంగా ఆయన తాండూర్, వికారాబాద్, పరిగి పట్టణాల్లో సన్నాహక సమావేశాల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న 'తిరగబడదాం తరిమికొడదాం' అనే కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు పెండ్యాల అనంతయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతరెడ్డి, కౌన్సిలర్లు మురళీ, ప్రభాకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు రెడ్యా నాయక్, ఆసిఫ్, రఘుపతి రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యత లేకపోతే బిల్లులు నిలిపివేత



మనబడి పనులను పరిశీలిస్తున్న ఈఈ

పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్: మనఊరు–మనబడి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేని యెడలా బిల్లులు నిలిపివేస్తామని పీఆర్‌ఈఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం బాలంపేట, అల్లాపూర్ గ్రామాల్లో జరుగుతున్న మనబడి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంట్రాక్టర్లు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, బిల్లులు కూడా త్వరలో వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ మహిపాల్ ఏఈ రవికిరణ్, తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రమేష్



యాలాల: బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా గోరేపల్లి గ్రామానికి చెందిన కుర్వ రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు మంగళవారం రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు మహిపాల్, హన్మంతులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా విజయభాస్కర్‌గౌడ్



విజయభాస్కర్‌కు నియామకపత్రం అందజేస్తున్న వీరేశ్ ముదిరాజ్

దోమ: టీడీపీ మండల అధ్యక్షుడిగా విజయభాస్కర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన వీరేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు చంద్రహాస్, నేతలు బాలముకుందం, మాణిక్యం, శ్రీశైలం, సాయిలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెద్దేముల్: పేద విద్యార్థులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యేటా నోటుబుక్స్ పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ సెక్రటరీ భాను ప్రసాద్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ జన్మదినం సందర్భంగా తాండూరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కళాశాలలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుక్స్ ఇతర వస్తువులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, అధ్యాపకులు, యువసేన సభ్యుడు ఇందూరు కుర్వ బాలు, చంద్రశేఖర్, అన్వర్, పాష, విజయ్, నరేష్ గౌడ్, సాయికుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఏబీవీపీ నిరంతరం కృషి



సభ్యత్వ నమోదు చేపడుతున్న ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు తదితరులు

అనంతగిరి: విద్యార్థుల్లో దేశభక్తి భావాలను, విద్యాభివృద్ధికి ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తుందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు స్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, దేశభక్తిని నింపేందుకు కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు విలువలతో కూడిన జాతీయ విద్యా విధానం కావాలని 30 ఏళ్లుగా ఏబీవీపీ పోరాటం చేసిన విషయం తెలిసిందేనని చెప్పారు. అన్ని ప్రభుత్వాలు అధికారికంగా జాతీయ విద్యా విధానాన్ని నిర్వహిస్తే, అన్ని రకాల నైపుణ్యాల్లో వారు అభివృద్ధి చెంది, ఈ దేశం శక్తివంతం అవుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘమైన ఏబీవీపీతో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నవీన్, నగర కార్యదర్శి హరీశ్‌రావు, కార్తీక్, అమర్నాథ్, వంశీ, సతీష్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

25న ముదిరాజ్ ప్లీనరీ

కుల్కచర్ల: ముదిరాజ్ ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ సంఘం చౌడాపూర్ మండల అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్లీనరీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 25న నగరంలోని బేగంపేట్ పైగా ప్యాలెస్‌లో ప్లీనరీ జరుగుతుందన్నారు.

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే చర్యలు

దోమ: సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా ఇష్టానుసారంగా పోస్టులు పెడితే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవిగౌడ్ హెచ్చరించారు. మంగళవారం దోమ మండలం గుండాల గ్రామానికి చెందిన కుర్వ శివకుమార్ అనే వ్యక్తి తన గ్రామానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో సీఎం కేసీఆర్ మృతి చెందాడని పోస్టు పెట్టారు. అది గమనించిన పార్టీ స్థానిక నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వాట్సప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర వాటిలో ఓ వ్యక్తికి సంబంధించి కానీ, వర్గానికి, కుల, మతాలకు సంబంధించి కానీ రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ రహదారిని కొడంగల్ మీదుగా విస్తరించండి

కొడంగల్: మహబూబ్‌నగర్–చించోలీ జాతీయ రహదారిని కొడంగల్ పట్టణం మీదుగా విస్తరించాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ విజయకుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బైపాస్ నిర్మించడం వలన రైతుల పొలాల నుంచి రోడ్డు వెళ్లే అవకాశం ఉందని, బైపాస్‌ను ఊరు చివర నుంచి తీసుకుంటే రైతులకు నష్టం జరుగుతుందని వాపోయారు. సంబంధిత అధికారులు సమస్యను పరిశీలించి, తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని టీడీపీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేష్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని, తద్వారా ముక్తి లభిస్తుందని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, పర్షమోని బాబయ్య, రాము పాల్గొన్నారు.